బయోసైన్స్ ఫోరం జిల్లా కార్యవర్గం ఎన్నిక

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: తెలంగాణ బయోసైన్స్ ఫోరం మెదక్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం జిల్లా అధ్యక్షుడిగా దొంతి ప్రసన్న కుమార్, ప్రధాన కార్యదర్శిగా మెరుగు నరేందర్, కోశాధికారిగా సాతెల్లి రమణ ఎన్నికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యం

మెదక్, మెదక్ రూరల్: ఆయిల్ పామ్ విస్తరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో ఆయిల్‌పామ్ పంట విస్తరణపై సమీక్షించారు. కోతుల బెడద లేని పంటకావడంతో రైతులందరూ ముందుకు వచ్చి పంట సాగు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.



వ్యాక్సిన్ గదిలో పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- పశు వైద్యాధికారులు సమయపాలన పాటించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మండలంలోని మాచవరం పశువైద్యశాలను, జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. వ్యాక్సిన్ నిల్వ గదిని, పశు వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ పరిసరాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. పుస్తకాలు అందుబాటులోకి తేవాలని, ఇంటర్నెట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పశు వైద్యాధికారి లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ అధికారులు ఉన్నారు.

డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించాలి: ఎస్పీ

నర్సాపూర్: డయల్ 100కు వస్తున్న కాల్స్‌పై వెంటనే స్పందించాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట, చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన నేరాలపై ఎస్సైలు, సీఐలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు బిగించాలన్నారు. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గింది.. అమ్మ దర్శనమిచ్చింది...



పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద అమ్మవారి గర్భాలయ దర్శనాలు శుక్రవారం పునఃప్రారంభమయ్యాయి. గత మూడు రోజులుగా వరద కొనసాగడంతో ఆలయాన్ని మూసివేసి రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేసిన సంగతి తెలిసిందే. గురువారం రాత్రికి వరద తగ్గడంతో శుక్రవారం తెల్లవారుజామున సిబ్బంది ఆలయాన్ని శుభ్రం చేశారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన తదుపరి భక్తులకు దర్శనం కల్పించారు.

పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు



మెదక్, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని అధికారులు, సిబ్బందికి శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'పోలీసు ప్రతిష్ఠను మెరుగుపరచడంలో పోలీసుల పాత్ర', దృఢమైన శరీరంలో దృఢమైన మనస్సు' అంశాలపై పోటీలు నిర్వహించారు. ఆరుగురి పేర్లను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అదనపు ఎస్పీ మహేందర్ పర్యవేక్షించారు.

ఆసుపత్రి సేవలపై కలెక్టర్ కన్ను

కలెక్టరేట్ నుంచి సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

న్యూస్‌టుడే, మెదక్, వెల్దుర్తి, టేక్మాల్

- గత ఆగస్టులో కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేయగా వైద్యాధికారి, సీనియర్ సహాయకులు, ఆయుష్ వైద్యాధికారులు, సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. దీంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైద్యాధికారికి తాఖీదులు ఇవ్వగా, సీనియర్ సహాయకులను సస్పెండ్ చేశారు. ఓ ఆయుష్ సిబ్బందిని తొలగించారు.
- గత నెల 17న కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఇద్దరు సూపర్‌వైజర్లు, ఒక ఎంపీహెచ్‌వో విధులకు హాజరుకాలేదు. దీంతో వారిని కలెక్టర్ సస్పెండ్ చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యాధికారులు, సిబ్బంది పనితీరుపై కలెక్టర్ దృష్టి సారించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు అందుతున్న సేవలు, సిబ్బంది హాజరును నేరుగా పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం ప్రతి ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలను బిగించేలా చర్యలు తీసుకున్నారు. ఇది వరకు ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు బిగించగా... పలుచోట్ల మరమ్మతులకు గురి కాగా, వాటి స్థానంలో కొత్తవి బిగించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న సీసీ కెమెరాలను కలెక్టరేట్‌కు అనుసంధానం చేశారు. కలెక్టర్ నేరుగా పర్యవేక్షించనున్నారు.



టేక్మాల్ పీహెచ్‌సీలో సీసీ కెమెరాలు

ఆసుపత్రులకు నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది సరిగా విధులకు హాజరుకావడం లేదనే విమర్శలున్నాయి. ఆలస్యంగా రావడం.. అసలే రాకపోవడం.. ఆ తర్వాత వచ్చి హాజరు పట్టికలో సంతకం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు రోజుల తరబడి రాకున్నా తమ పరపతిని ఉపయోగిస్తూ కొనసాగుతున్నారు. మరి కొందరు మధ్యాహ్నమే ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

కలెక్టరేట్‌కు అనుసంధానం...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కలెక్టరేట్‌కు అనుసంధానం చేశారు. కలెక్టర్ ఛాంబర్‌లో మానిటర్‌ను ఏర్పాటు చేశారు. అన్ని ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన కెమెరాల దృశ్యాలను కలెక్టర్ నేరుగా పర్యవేక్షించే అవకాశం ఉంది.

పది చోట్ల కొత్త కెమెరాలు...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇది వరకే సీసీ కెమెరాలు బిగించారు. వీటిల్లో పలు చోట్ల పనిచేయడం లేవు. పనిచేయని పీహెచ్‌సీలను గుర్తించి వాటిలో కొత్తవి బిగించారు. ఒక్కో ఆరోగ్య కేంద్రంలో నాలుగు కెమెరాలను బిగించారు. ఔషధాలు అందజేసే చోట, వరండాలో, వైద్యాధికారి గది, ప్రయోగశాలలో కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సైతం బిగించారు. పీహెచ్‌సీలతో పాటు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రుల్లో బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది.

పర్యవేక్షణ పెరుగుతుంది శ్రీరాం, జిల్లా వైద్యాధికారి

పది పీహెచ్‌సీలలో కెమెరాలు ఏర్పాటు చేశాం. కలెక్టరేట్‌కు అన్ని పీహెచ్‌సీల కెమెరాలు అనుసంధానం పూర్తయింది. అక్కడి నుంచే కలెక్టర్ నేరుగా పర్యవేక్షించే అవకాశం ఉంది. దీంతో సిబ్బందిపై పర్యవేక్షణ పెరుగుతుంది.



కలెక్టర్ ఛాంబర్‌లో కెమెరా మానిటర్

గొంతులెండె.. గుండె రగిలె.. బిందెలు పగిలె

అరకొర నీటి సరఫరాపై మహిళల ఆగ్రహం



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన



బిందెను నేలకేసి కొడుతున్న పద్మ

రంగాయపల్లి(మనోహరాబాద్), న్యూస్‌టుడే: పదిహేను రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆ గ్రామస్థుల గొంతులెండిపోయాయి. గుండె రగిలిన మహిళలు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మండలంలోని రంగాయపల్లిలో శుక్రవారం జరిగింది. తాగేందుకు నీరు లేదని పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. పద్మ అనే మహిళ స్టీల్ బిందెను పలుమార్లు నేలకేసి కొట్టింది. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ అధికారులు శ్రీధర్, దివ్య మహిళలతో మాట్లాడారు. నీరు రాకపోవడానికి కారణాలు వివరించారు. బోరు నీరు వద్దని, అవి వినియోగించడంతో ఆరోగ్యాలు పాడవుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. మిషన్ భగీరథ నీటినే సరఫరా చేయాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ శ్రీధర్‌ను వివరణ కోరగా.. రంగాయపల్లిలో 40 వేల లీటర్ల సామర్థ్యమున్న రెండు ట్యాంకులున్నాయన్నారు. ఎక్కువ శాతం నీరు సరఫరా చేసే ట్యాంకు ఎయిర్‌వాల్వుల్లో సమస్యలు తలెత్తడంతో గురువారం నీరు రాలేదన్నారు. రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు.

ధరణితోనే భూ సమస్యలు అధికం: సీపీఎం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా 60 శాతం భూ సమస్యలే ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమస్యాత్మకమైన భూములపై నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ధరణితోనే భూ సమస్యలు అధికమయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని రద్దు పరుస్తామని చెబుతూ కాలయాపన చేస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించకపోవడంతో పేద కుటుంబాల్లో తరచూ గొడవలు జరుగుతున్నాయన్నారు. నవంబర్ 2, 3వ తేదీల్లో తూప్రాన్‌లో జరిగే సీపీఎం మెదక్ జిల్లా 15వ మహాసభలో భూ సమస్యలపై తీర్మానం ప్రవేశపెట్టి పోరాటానికి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో వ్యకాసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవయ్య, మల్లేశం, ఉపాధ్యక్షురాలు నాగమణి, నాయకులు స్వామి, వెంకటయ్య, యాదగిరి, రాజు ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మ

దళారులకు ధాన్యం అమ్మొద్దు: ఎమ్మెల్యే

నర్సాపూర్ రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని గూడెంగడ్డ, తుల్జారాంపేట, చిన్నచింతకుంట, రెడ్డిపల్లి, మంతూరు, ఖాజీపేట, తుజాల్‌పూర్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో శుక్రవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. దళారులకు అమ్మవద్దని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో వైద్యశ్రీనివాస్, ఏపీఎం గౌరిశంకర్, బల్దియా వైస్‌ఛైర్మన్ నయిమోద్దీన్, నాయకులు బాబ్యానాయక్, బోగచంద్రశేఖర్, హుమ్లా, రామునాయక్, తదితరులు ఉన్నారు.



కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి: ఎంపీ

మెదక్: ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేది జర్నలిజమని, విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి మేలు అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ ప్రారంభించారు. ప్రజా సంక్షేమ పథకాలను జర్నలిస్టులు ప్రజలకు చేరవేయాలన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. సమాజంలోని వివక్ష, మూఢనమ్మకాలు, సామాజిక బహిష్కరణ, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై వార్తలతో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ మానస్ కృష్ణకాంత్, డీపీఆర్వో రామచంద్ర రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు



ఒడిదొడుకులు దాటి.. సివిల్స్ సాధించి..

న్యూస్‌టుడే, తూప్రాన్, మనోహరాబాద్

ఒకరిది పేద కుటుంబం.. మరొకరికి అత్యున్నత ఉద్యోగమే లక్ష్యం.. ఇలా తమ లక్ష్యాల సాధనకు ఎంతో శ్రమించారు. ఎన్నో అడ్డంకులను అధిగమించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి తాము అనుకున్నది సాధించారు. లక్షల మంది పోటీపడిన ఈ పరీక్షల్లో తామెంటో నిరూపించుకున్నారు. ఎన్నో ఒడుదొడుకులు దాటుకొని ఇక్కడి వరకు వచ్చారు. ప్రజాసేవే ధ్యేయంగా సివిల్ సర్వీసెస్ సాధించిన వారంతా పల్లెల బాట పట్టారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలు లబ్ధి పొందుతున్న తీరు, జీవనస్థితిగతులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్, మనోహరాబాద్ మండలం కూచారం గ్రామాలకు వచ్చారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే' వారిని పలకరించింది. ఆయా విశేషాలు వారి మాటల్లోనే ఇలా..

కిరాణా వ్యాపారి కుమారుణ్ని



మాది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మహాసముండ్ గ్రామం. మధ్యతరగతి కుటుంబం. 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. తండ్రి కిరాణా దుకాణం నిర్వహిస్తూ మమల్ని పోషించారు. తల్లి గృహిణి. నాన్నకు సహకారాలు అందించేది. ఇంట్లో కష్టాలను చిన్నప్పటి నుంచి చూశా. వాటిని అధిగమించాలంటే ఉన్నత స్థానానికి చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. సివిల్స్ సాధించడమే ధ్యేయంగా సన్నద్ధమయ్యా. రెండుసార్లు విఫలం కాగా, మూడోసారి ఉత్తమ ర్యాంకు సాధించగా ఐపీఎస్ వచ్చింది. కరోనా సమయంలో ఎంపికయ్యా. దీని కారణంగా క్షేత్రస్థాయి శిక్షణ పూర్తికాలేదు. అందులో భాగంగానే ఇప్పుడు ఇక్కడికి వచ్చా. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో ఉద్యోగం చేస్తున్నా. చదువుకు కులమతాలు, ధనిక, పేద అన్న తేడా లేదు. కష్టపడితే ఏదైనా సాధ్యమే. యువతీ, యువకులు అందరూ గమ్యం నిర్దేశించుకుని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలి.

– ఆకాష్‌కుమార్ శుక్లా, ఐపీఎస్ అధికారి

సాఫ్ట్‌వేర్ కొలువు కాదనుకొని..



మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవూ. ఐఐటీ బొంబాయిలో బీటెక్ పూర్తి చేశా. చిన్నప్పటి నుంచి ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు పడలేదు. బీటెక్ తర్వాత సాఫ్ట్‌వేర్ కంపెనీలో అత్యున్నత జీతంతో ఉద్యోగం వచ్చింది. కొద్దిరోజులు ఉద్యోగం చేశాక, అది నచ్చలేదు. ప్రజలకు ఏదైనా సేవ చేయాలన్న తలంపుతో సివిల్ సర్వీస్‌ను ఎంచుకున్నా. ఇందులో ఉద్యోగమే లక్ష్యంగా అడుగేశా. శిక్షణ తీసుకున్నాం. రెండుసార్లు సివిల్స్ రాసి విఫలమయ్యా. అయినా కుంగిపోలేదు. కుటుంబ సభ్యులు సహకారం అందించారు. మూడోసారి విజయం వరించగా, ఐఈఎస్(ఇండియన్ ఎకనామిక్ సర్వీస్) వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనంలో మార్పు తీసుకురావాలంటే ప్రభుత్వం ఎంతో చేయాల్సి ఉంటుంది. అందులో సివిల్ సర్వీస్ అధికారులదే కీలక పాత్ర. నేటి యువత పోటీ పరీక్షల్లో ఉద్యోగం రాలేదని ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ధైర్యంగా ముందుకు సాగితే విజయం ఖాయం.

– జాన్విపటేల్, లఖ్‌నవూ, ఉత్తర్‌ప్రదేశ్

నాన్న స్ఫూర్తిగా అడుగేశా..



నా స్వగ్రామం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్. నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ గృహిణి. చిన్నతనంలోనే సివిల్స్ సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. ఈ విషయంలో నాన్నే నాకు స్ఫూర్తి. ఆయన సూచనలతో ముందుకు సాగా. పోటీ పరీక్షల్లో రాణించేందుకు మెలకువలు నేర్చుకున్నా. రోజులో 16 గంటల పాటు చదివాను. సివిల్స్‌కు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన పెంచుకున్నా. దీని గురించి చరవాణిని సైతం కొన్నాళ్ల దూరంగా ఉంచా. అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించాను. 2023లో తొలిసారిగా పరీక్ష రాయగా ఉత్తీర్ణత సాధించా. ఐఈఎస్(ఇండియన్ ఎకనామిక్ సర్వీస్) వచ్చింది. క్షేత్రస్థాయి పర్యటనలో పక్కాగా పథకాలు అమలు చేస్తే ప్రజలకు ఎంతో మేలు చేయవచ్చని తెలుసుకున్నా.

– వైభవ్ రాథోడ్, శిక్షణ ఐఈఎస్ అధికారి

తెలంగాణ క్యాడర్‌లోనే..



మాది మహారాష్ట్ర. నాన్న కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఆయన స్ఫూర్తితోనే పోలీసు శాఖలో చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. అందులోనూ ఐపీఎస్ సాధించాలని సంకల్పించుకున్నా. దీని గురించి అన్ని రకాలుగా తెలుసుకున్నా. ఎప్పటికప్పుడు పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకున్నా. మొదటి సారి పరీక్ష రాయగా విఫలమయ్యాను. రెండోసారి విజయం సాధించా. అత్యుత్తమ ర్యాంకు రాగా, ఐపీఎస్‌కు ఎంపికయ్యా. ప్రస్తుతం తెలంగాణ క్యాడర్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నా. క్షేత్రస్థాయి శిక్షణ పూర్తికాకపోవడంతో ఇప్పుడు ఇక్కడికి వచ్చా. నా తండ్రి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో కష్టపడి చదివా. రోజులో 16 గంటలు దీనికే కేటాయించా. ఆత్మవిశ్వాసంతో అడుగేస్తే విజయం ఖాయమని నా ఉద్దేశం.

– చేతన్‌నితిన్, ఐపీఎస్ అధికారి

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ప్రతినిధి జశ్వంత్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రోబోటిక్స్ విద్యతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడంతో పాటు సమస్యల పరిష్కార నైపుణ్యాలు మెరుగుపర్చడమే ప్రధాన ధ్యేయమని సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ప్రతినిధి జశ్వంత్ అన్నారు. శుక్రవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సహకారంతో రోబోటిక్స్ ఆన్ అకాడమిక్ (ఆర్ఐఏ) అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జశ్వంత్ మాట్లాడుతూ. . సైన్స్‌ను ఇష్టంగా అభ్యసించాలని, తద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 16 జిల్లాల్లోని 285 పాఠశాలల్లో 47,875 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ ఇచ్చామని చెప్పారు. త్వరలో మరిన్ని చోట్ల ప్రారంభిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ.. రోబోటిక్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. భౌతికశాస్త్రం విద్యార్థులు 80 మందికి శిక్షణ ఇచ్చారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి సింహారెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధనలక్ష్మిగా వాసవీమాత



దుబ్బాక పట్టణం వైశ్యభవన్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. అమ్మవారిని రూ.॥ లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి మాతగా అలంకరించి పూజలు చేశారు.

- న్యూస్‌టుడే, దుబ్బాక

రోగుల నాడి పట్టి చూస్తున్నారా..!



నర్సాపూర్ ఆసుపత్రిలో సేవలపై ఆరా తీస్తున్న రాష్ట్ర కమిషనర్ అజయ్ కుమార్

నర్సాపూర్, కౌడిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ఉంటూ, వారి నాడి పట్టి పరీక్షించాలని రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ స్పష్టంచేశారు. శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌పేషంట్ల విభాగం, ఓపీ నిర్వహణను పరిశీలించారు. వేచి ఉన్న రోగులతో మాట్లాడారు. వైద్యులు నాడి పట్టి చూస్తున్నారా, అవసరమైన మందులు ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ పావనికి సూచించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శివదయాల్, వైద్యులు మిర్జాబేగ్, రాజేష్, వంశీ తదితరులు ఉన్నారు. అనంతరం కౌడిపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న సామాజిక ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఇక్కడి పీహెచ్‌సీని తనిఖీ చేసి రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని స్పష్టంచేశారు. వైద్యులు, సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని సూచించారు. వైద్యురాలు మహిమ, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ ఉన్నారు.

ఐఐటీహెచ్‌లో అంకుర సంస్థల సదస్సు

సంగారెడ్డి టౌన్, కంది, న్యూస్‌టుడే: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ఉత్పత్తిదారులకు చేయూతే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీహెచ్‌లో శుక్రవారం స్టార్టప్, ఇన్వెస్టర్ల సదస్సు నిర్వహించారు. వీసీ సర్కిల్-ప్యూర్ ఈవీ అంకుర సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 60 అంకుర సంస్థలు, 130 మంది యువ పారిశ్రామికవేత్తలు, దేశ విదేశాలకు చెందిన 30 మంది పెట్టుబడిదారులు ఇందులో భాగస్వాములయ్యారు. అంకుర సంస్థల ప్రతినిధులు తమ ఆలోచనలను పెట్టుబడిదారుల ముందుంచారు. ఆధునిక సాంకేతికత ఆలోచనతో రూపొందించిన ప్రాజెక్టులతో ముందుకు వచ్చే అంకుర సంస్థల్లో పెట్టుబడులకు పలువురు ఆసక్తి చూపారు. అంతకు ముందు 'భారత దేశంలో ఎలక్ట్రిక్ వాహన విప్లవం-భవిష్యత్తు' అనే అంశంపై రూపొందించిన శ్వేతపత్రాన్ని ఐఐటీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్యూర్ ఈవీ(ఎలక్ట్రికల్ వెహికిల్) వ్యవస్థాపక ఛైర్మన్ డా.నిశాంత్ దొంగరి ఆవిష్కరించారు.

ఇంట్లో చోరీ.. ముగ్గురు మహిళల అరెస్టు

కల్హేర్, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసిన ముగ్గురు మహిళలను అరెస్టుచేసి ఆభరణాలతో పాటు నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కల్హేర్ ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాలు.. ఈనెల 15న కల్హేర్‌కు చెందిన బత్తిని పద్మవ్వ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ విషయం పసిగట్టిన ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు చెగోళ్ల చంద్రకళ, మీసాల గంగవ్వ, అల్లాపూరం ఉమారాణిలు జతకలిసి అదేరోజు పద్మవ్వ ఇంటి తాళం పగులగొట్టి ఆభరణాలతోపాటు నగదు చోరీకి పాల్పడ్డారు. నిందితులు సొత్తును సమీపంలోని గ్రామంలో అమ్మకం చేయడంతో విషయం బయటకు వచ్చింది. కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు నిందితులు అమ్మిన రెండు తులాల బంగారు పుస్తెల తాడు, 20 తులాల వెండి కడియాలు, పది తులాల పట్ట గొలుసులతో పాటు రూ.30 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

కారు షెడ్డులో అగ్నిప్రమాదం

ఆహుతైన 9 వాహనాలు



కాలిపోయిన కార్లు

తూప్రాన్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి నర్సాపూర్ చౌరస్తా సమీపంలోని కారు షెడ్డులో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. నర్సాపూర్ చౌరస్తా సమీపంలో కారు మెకానిక్ షెడ్డు ఉంది. గురువారం రాత్రి ఎప్పటిలాగే షెడ్డుకు తాళం వేసి నిర్వాహకులు, కార్మికులు వెళ్లిపోయారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కార్లున్న షెడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అందులోని తొమ్మిది కార్లు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానికులు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను అదుపులోకి తెచ్చాయి. షెడ్డులోని కార్లు కాలిపోయాయి. ప్రమాదం ఎలా జరిగిందనే విషయమై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మోసపోయాం న్యాయం చేయండి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

మోమిన్‌పేట: మేము కొనుగోలు చేసిన స్థలాల్లో, పంటలు సాగు చేస్తున్నారని, మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు రెవెన్యూ అధికారులకు శుక్రవారం విన్నవించారు. అధికారులు, బాధితులు తెలిపిన ప్రకారం మండల పరిధి ఎన్కెపల్లి శివారు 86 సర్వే నంబరులో షేక్‌బద్రోద్దీన్ వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి, ప్లాట్లుగా విక్రయించాడు. 34 మందికి వికారాబాద్‌లో రిజిస్ట్రేషన్ చేశాడు. లేఅవుట్ లేని భూముల్లో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన వారి ప్లాట్లను ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో బాధితులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇంటి స్థలాలు పరిశీలించేందుకు అధికారులు శుక్రవారం వస్తారని పంచాయతీ కార్యదర్శి పార్వతమ్మ దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారంతా పత్రాలతో కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాల వద్దకు వెళ్లి చూడగా, ఆ భూమి చుట్టూ ప్రహరీ ఉండడంతో వారికి ఏంచేయాలో అర్థం కాలేదు. స్థలాలు చూపిస్తేనే ఎల్ఆర్ఎస్ చేసే వీలుంటుందని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన అధికారులు చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఉప తహసీల్దార్ సురేష్‌కు వివరించి, వినతిపత్రం ఇచ్చారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	115-00	డ్రెస్డ్	199-00
రిటైల్	137-00	స్కిన్‌లెస్	226-00

పిడుగు గుట్టు తెలిపేలా..



యాప్‌లో వివరాలు

ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసినప్పుడు ఎక్కడో చోట పిడుగు పడిందని మనకు తెలుస్తుంటుంది. దాని కారణంగా మనుషులు సైతం మృతి చెందుతుంటారు. అత్యధికంగా అటవీ ప్రాంతం, ఎత్తయిన కొండ ప్రాంతాల్లో ఇవి పడుతుంటాయి. పిడుగుపాటు ప్రమాదాన్ని ముందే గుర్తించేలా భారత వాతావరణ విభాగం, శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దామిని లైట్‌నింగ్ అలర్ట్ పేరిట దీన్ని రూపొందించింది. దీని ద్వారా మనం ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో లేదో ముందే తెలుసుకొని జాగ్రత్త పడొచ్చు.

హెచ్చరించేలా..

భారత వాతావరణ విభాగం (ఐఎండీ), శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐఐటీఎం పూణే రూపొందించిన దామిని లైట్‌నింగ్ అలర్ట్ (Damini lightning Alert) యాప్ ద్వారా ముందే పిడుగుపాటును తెలుసుకోవచ్చు. ముందుగా ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ లేదంటే యాపిల్ యాప్‌స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ఫోన్‌లో జీపీఎస్ ఎనేబుల్ చేసి పేరు, మొబైల్ నంబరు, చిరునామా, పిన్‌కోడ్ వంటి వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత మీరున్న ప్రాంతానికి 20-40 కి.మీ. పరిధిని ఒక సర్కిల్‌గా చూపిస్తుంది. అక్కడ పిడుగు పడుతుందా, లేదంటే ఎంత సేపట్లో పడుతుందనేది హెచ్చరిస్తుంది. ఆయా హెచ్చరికలను మూడు రంగుల్లో (ఎరుపు, పసుపు, నీలం) వ్యవధి సమయాన్ని సూచిస్తుంది.

- ఎరుపు ఉంటే 7 ని.లు, పసుపు ఉంటే 10-15 ని., నీలం ఉంటే 18-25 నిమిషాల్లో అక్కడ పిడుగు పడే వ్యవధిని సూచిస్తుంది.

మేఘాలు ఢీకొని..

ఆకాశంలో వేగంగా కదిలే మేఘాలు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నప్పుడు విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దాని ప్రసరణకు ఒక వాహకం అవసరం. భూమ్యాకర్షణతో పిడుగు రూపంలో నేలపైకి విద్యుత్తు ప్రసరిస్తుంది. దీని శక్తి సూర్యుడి ఉపరితల శక్తి కన్నా ఎన్నో రెట్లు ఎక్కువని పలు పరిశోధనల్లో తేలింది. మేఘాలు, భూమికి మధ్య ఉండే గాలి పిడుగును నేల వైపునకు చేరుస్తుంది. ఒక పిడుగుతో సుమారు 30 కోట్ల వోల్టుల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని అంచనా.

యాప్ రాడార్ ద్వారా సమాచారాన్ని సేకరించి జీపీఎస్ ద్వారా మనకు తెలియజేస్తుంది. తెలుగుతో పాటు 23 భాషల్లో సమాచారం అందిస్తుంది. మనం ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉంటే యాప్ నోటిఫికేషన్ వస్తుంది. తద్వారా అప్రమత్తం కావొచ్చు. పొలాల వద్ద పని చేసే రైతులు, పశుకాపరులు, ఆరు బయట పనిచేసే వారికి ఇదెంతో ఉపయోగకరం.

- న్యూస్‌టుడే, పాపన్నపేట

భార్యను హత్య చేసిన భర్త రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోష్‌కుమార్

న్యూస్‌టుడే, తాండూరు: భార్యను కొట్టి చంపిన భర్తను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం యాలాల మండలం కమాల్‌పూర్ గ్రామానికి చెందిన మ్యాతరి శ్రీకాంత్, ఆయన భార్య సుజాత(23) పాత తాండూరు రైల్వేగేటు సమీపంలో నివాసం ఉంటున్నారు. భార్యను అనుమానించిన శ్రీకాంత్ గురువారం రాత్రి ఆమెపై దాడి చేసి కొట్టాడు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం తెలియడంతో వెంటనే అక్కడికి వచ్చి జిల్లా ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నామని వివరించారు.

ద్విచక్ర వాహనాల దొంగ జైలుకు..

రాయపోల్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. రాయపోల్ ఠాణాలో ఆయన వెల్లడించిన వివరాలు.. రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన కోనేరు యాదగిరి మద్యానికి బానిసయ్యాడు. 15 రోజుల క్రితం మరోవ్యక్తితో కలిసి హైదరాబాద్‌లో బోయిన్‌పల్లి మార్కెట్ సమీపంలోని బాపూజీనగర్‌లో రోడ్డుపక్కన నిలిపిన బైక్‌ను దొంగిలించి అనాజీపూర్‌లో ఓ వ్యక్తికి విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఈనెల 18న రాయపోల్ వైన్స్‌లో మద్యం తాగి జీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ ముందు నిలిపిన స్కూటీని దొంగిలించారు. శుక్రవారం స్కూటీని హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా రాయపోల్ సబ్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా దొంగతనం కేసులు బయటపడ్డాయని సీఐ వివరించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

రైతులకు ఉపాధినిచ్చే పనులకే ప్రాధాన్యం



వివరాలు ఆరా తీస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి కృష్ణమూర్తి

చేర్యాల (మద్దూరు), న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం కింద 2025-26 సంవత్సరానికి గాను రూపొందిస్తున్న ప్రణాళికలో రైతులకు ఉపాధితో పాటు ప్రజా ప్రయోజనం ఉన్న పనులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్ఆర్ఈజీఎస్ ప్రోగ్రాం రాష్ట్ర మేనేజరు కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు, ధర్మారం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. గతేడాది చేపట్టిన పనులు, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తయారు చేసిన ప్రణాళికలో పేర్కొన్న పనుల ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. పనుల్లో ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా చూడాలన్నారు. అందరికీ ఉపయోగపడే వాటికే ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. శతశాతం పూర్తిచేసేలా కార్యాచరణ ఉండాలని స్పష్టంచేశారు. జిల్లా ఏపీడీ శివాజీ, కోఆర్డినేటర్ (లైజన్ అధికారి) నూరుద్దీన్, ఎంపీడీవో రామ్మోహన్, ఏపీవో పరశురాములు, సాంకేతిక సహాయకులు దేవేందర్, శ్రీనివాస్, వెంకటమ్మ తదితరులున్నారు.

కళాఉత్సవ్ పోటీల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ



బృందగానంలో పాల్గొన్న విద్యార్థులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఏక్‌భారత్ శ్రేష్ఠ్‌భారత్‌లో భాగంగా ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో సిద్దిపేట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలలోని ఏడు నుంచి 10వ తరగతికి చెందిన 12 మందితో కూడిన బాలబాలికల జట్టు అక్కడి రీజినల్ స్థాయిలో నిర్వహించిన బృందగానం పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని విద్యాలయ ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్, కో-ఆర్డినేటర్లు సంధ్య, పీఈటీ భూమయ్య తెలిపారు. నవంబరు 11 నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్ తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఈ బృందం పాల్గొంటుందని వారు వెల్లడించారు. ఈ మేరకు విజేతలను అభినందించారు.

విజ్ఞాన ప్రదర్శనకు సిద్ధమవుదాం..

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట, సిద్దిపేట, వికారాబాద్ కలెక్టరేట్

నవంబరులో నిర్వహణకు ఆదేశాలు



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

భావి శాస్త్రవేత్తలను రూపొందించడమే లక్ష్యంగా కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా విజ్ఞాన ప్రదర్శనలను నిర్వహిస్తోంది. వారి ఆలోచనలకు అనుగుణంగా నమూనాలను రూపొందించి ప్రదర్శించే అవకాశం కల్పిస్తారు. 2023-24కు సంబంధించి ఇన్‌స్పైర్ మనక్, ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. గతేడాది వరకు ఈ రెండింటిని వేర్వేరుగా ఏర్పాటు చేయగా, ఈ సారి ఒకేసారి నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ మేరకు ప్రదర్శనలను నవంబరులో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధ్యాయులు దృష్టిసారించాలి..



విద్యార్థులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సిద్ధం కావాలి. ఇందులో పాల్గొనేందుకు విద్యాశాఖ గుగూల్ ఫామ్‌లో నవంబరు మొదటి వారంలోపు వివరాలు నమోదు చేయాలి. అదే నెలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తాం. మరోవైపు ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైన వారు సైతం సిద్ధం కావాలి. గైడ్ ఉపాధ్యాయులు ఈ దిశగా దృష్టిసారించాలి.

- సిద్దారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, సంగారెడ్డి

ఇన్‌స్పైర్‌లో ఎంపికైనవే..

ఈ సారి రెండు ప్రదర్శనలు కలిపి నిర్వహిస్తున్నా.. ఇన్‌స్పైర్ మనక్‌లో మాత్రం కేవలం ఎంపిక చేసిన విద్యార్థులు మాత్రమే పాల్గొనాలి. ఇందుకు ఒక్కో విద్యార్థికి ప్రాజెక్టు తయారీ నిమిత్తం రూ.10 వేలు వారి ఖాతాలో జమచేస్తారు. అంతర్జాలంలో నమోదు చేసిన నమూనాను మాత్రమే ప్రదర్శించాలి. ఇన్‌స్పైర్ మనక్‌లో గతేడాది ఆరు నమూనాలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాల నుంచి రెండు చొప్పున ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. మెదక్ నుంచి ఒక్కటీ ఎంపిక కాలేదు.

నిర్దేశించిన అంశాలు

ప్రధాన: సుస్థిర భవిష్యత్తుకు శాస్త్ర సాంకేతిక

ఉప అంశాలు

1. ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రత
2. రవాణా కమ్యూనికేషన్
3. సహజ వ్యవసాయం
4. విపత్తుల నిర్వహణ
5. గణిత నమూనాలు, గణన ఆలోచన
6. వ్యర్థాల నిర్వహణ
7. వనరుల నిర్వహణ

14 మందికి..

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జూనియర్ విభాగంలో 6-8 తరగతులు, సీనియర్ విభాగంలో 9, 10 తరగతులకు అవకాశం కల్పిస్తారు. నిర్దేశించిన ప్రధానంశంతో పాటు ఉప అంశాల్లో నమూనాలు తయారు చేయాలి. ఒక్కో పాఠశాల నుంచి 14 మంది పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఒక ఉపాధ్యాయుడు గైడ్‌గా వ్యవహరిస్తారు. మరోవైపు ఉపాధ్యాయులు, బీఈడీ, డీఈడీ విద్యార్థులు సైతం తాము రూపొందించిన నమూనాలను ప్రదర్శించవచ్చు. ఇందుకు విద్యాశాఖకు సంబంధించిన గుగూల్ ఫామ్‌లో పూర్తి వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది.

నాలుగు జిల్లాల్లో ఎంపిక ఇలా..

సంగారెడ్డి	93	సిద్దిపేట	188
మెదక్	38	వికారాబాద్	54

ప్రయాణికులను సురక్షితంగా చేర్చడమే లక్ష్యం



పురస్కారాలు అందుకున్న సిబ్బందితో ఆర్ఎం ప్రభులత, డిపో మేనేజర్ సురేఖ, అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యం ముందుకు సాగాలని ఆర్టీసీ మెదక్ ప్రాంతీయ మేనేజర్ ప్రభులత సిబ్బందికి సూచించారు. శుక్రవారం మెదక్ ఆర్టీసీ డిపో, గ్యారేజ్‌ను పరిశీలించి డిపో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో ఆర్టీసీపై ఆదరణ పెరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసా పత్రం, నగదు పురస్కారాలు అందజేశారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన ఆరుగురు మహిళలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, కార్యాలయ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ధ్వంసంపై హిందూ సంఘాల ఆందోళన


పెద్దశంకరంపేటలో ర్యాలీ

పెద్దశంకరంపేట, రేగోడ్: హిందూ దేవతల విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం పెద్దశంకరంపేటలో హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ముందస్తుగా ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా పేటలో వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, దుకాణాలను మధ్యాహ్నం వరకు స్వచ్ఛందంగా మూసివేశారు. మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, భాజపా మండల అధ్యక్షుడు కోసం విఠల్ తదితరులు పాల్గొన్నారు. రేగోడ్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరప్ప, సతీష్, పూర్ణచందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం: సీపీఎం


మాట్లాడుతున్న మల్లేశ్

తూప్రాన్, న్యూస్‌టుడే: కార్మికులు, రైతుల తరఫున నిరంతర పోరాటం చేస్తున్నట్లు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశ్ తెలిపారు. శుక్రవారం తూప్రాన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లా 15వ మహాసభల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో కార్మికులు, రైతులు, పేదలు, కూలీలు, మహిళలు, దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పార్టీ పోరాటం చేస్తున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చిస్తామన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ధరణి, భూ సమస్యల పరిష్కారానికి రైతాంగం తరఫున పోరాటం చేస్తున్నామన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్‌రెడ్డి, సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు దరఖాస్తులు సమర్పించాలి: ఆర్డీవో

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో రమాదేవి సూచించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి ఎమ్మెల్సీ ఎన్నికలపై అధికారులకు పలు సూచనలిచ్చారు. దరఖాస్తులు అందిన వెంటనే ధ్రువపత్రాలు పరిశీలించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. పట్టభద్రుల ఓటు నమోదుకు వచ్చే నెల 9, 10వ తేదీల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ధరణి సమస్యలపై అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని.. ఆదాయ ధ్రువపత్రాలను వెంటనే అందించాలన్నారు. కార్యాలయానికి వచ్చిన వారికి సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. తహసీల్దార్ మన్నన్, సిబ్బంది పాల్గొన్నారు.

శివ్వంపేట: అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని నాయబ్ తహసీల్దార్ షఫియొద్దీన్ తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదుకు నవంబర్ 6 వరకు అవకాశం ఉందన్నారు. ఫారం-18తోపాటు ధ్రువపత్రాలతో ఈ-మెయిల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పల్లె దవాఖానా.. భవనాలు సమకూరేనా?

న్యూస్‌టుడే, టేక్మాల్

ఇబ్బందులు పడుతున్న రోగులు

గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసినా.. వాటికి భవనాలు లేక అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. దీంతో చికిత్సకు వస్తున్న ప్రజలు, ఆరోగ్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల భవన నిర్మాణాలకు స్థలాలు కేటాయించినా అనుకూలంగా లేకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.


ధనూరాలో నిరుపయోగంగా భవనం

మండలంలో ఎనిమిది ఏర్పాటు..

మండలంలో ఎనిమిది పల్లె దవాఖానాలున్నాయి. వాటిలో సూరంపల్లి, వెల్మగొండ, తంపలూరులో సొంత భవనాలున్నాయి. మిగతా వాటికి లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పల్వంచలో సొంత భవనం లేకపోవడంతో ప్రస్తుతం పాఠశాలలోని రేకుల గదిలో పల్లె దవాఖానా కొనసాగుతోంది. గది అనుకూలంగా లేకపోవడంతో చికిత్సకు వచ్చే ప్రజలకు అసౌకర్యంగా మారుతోంది. దవాఖానా నిర్మాణానికి స్థలం కేటాయించగా.. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా రూ.20 లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభం కాకపోవడంతో అసౌకర్యంగా మారింది. ధనూరలో పాఠశాలలోని ఓ గదిలో దవాఖానా కొనసాగిస్తున్నారు. ఒకే గది ఉండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలో సుమారు 8 ఏళ్ల కిందట ఆరోగ్య ఉపకేంద్రం కోసం భవనం నిర్మించారు. కేవలం చిన్నచిన్న పనులు చేయకుండా వదిలేశారు. దీంతో అది వినియోగంలోకి రావడం లేదు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. భవనం పనులకు రూ.2 లక్షలు కేటాయిస్తే వినియోగంలోకి వస్తుందని పలువురు చెబుతున్నారు. ఎలకుర్తిలో భవనం లేకపోవడంతో పంచాయతీ కార్యాలయంలోని ఓ గదిని వాడుతున్నారు. కొత్త భవనం కోసం పంచాయతీరాజ్ ద్వారా రూ.20 లక్షలు మంజూరు కాగా.. అనుకూలమైన స్థలం దొరకలేదు. దీంతో పనులు ప్రారంభం కాలేదు. గ్రామ చెరువు సమీపంలో స్థలం కేటాయించడంతో పనులు కొనసాగడం లేదు. మండల కేంద్రం టేక్మాల్‌లో ప్రస్తుతం పాత పాఠశాల భవనంలో కొనసాగుతోంది. భవనం శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భవన నిర్మాణానికి భూమిపూజ చేసినా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. బొడ్మట్‌పల్లిలో పాఠశాల భవనంలో కొనసాగుతోంది. గుట్ట ప్రాంతంలో స్థలం కేటాయించడంతో ఆసుపత్రికి వచ్చే వారికి ఇబ్బందులు కలుగుతాయని వాపోతున్నారు.

అనుకూలమైన స్థలాలు కేటాయించాలి..

– సుగుణాకర్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి

పల్లె దవాఖానాను ఎలకుర్తిలో చెరువు పక్కన అనుకూలమైన స్థలం కేటాయించలేదు. బొడ్మట్‌పల్లిలో గుట్ట ప్రాంతంలో చూయించారు. దీంతో దవాఖానాకు వెళ్లే వారికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. వెంటనే అనుకూలమైన స్థలం చూపాలి. లేదంటే మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోతాయి. మిగతా చోట్ల త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. సొంత భవనాల్లేని గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్ 95730 81675, నర్సాపూర్ 80085 73222, తూప్రాన్ 96762 58144, చేగుంట 80085 73200, పెద్దశంకరంపేట 80085 73251, రామాయంపేట 94402 31031 (10AM TO 1 PM)

న్యూస్‌టుడే, శివ్వంపేట, టేక్మాల్, అల్లాదుర్గం:

? శివ్వంపేట శివాలయం ఎదుట మురుగు సీసీ రోడ్డుపై పారుతుంది. భక్తులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. – వెంకటేష్, స్థానికుడు

✓ మురుగు రోడ్డుపై పారకుండా తగిన చర్యలు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం. – రమాదేవి, పంచాయతీ కార్యదర్శి, శివ్వంపేట

? టేక్మాల్ చౌరస్తాలోని నూతన కాలనీలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలు అమర్చలేదు. – రమేష్, స్థానికుడు

✓ ఇటీవల దీపాలు ఏర్పాటు చేయించాం. చెడిపోయిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం. – రాకేష్, పంచాయతీ కార్యదర్శి, టేక్మాల్

? అల్లాదుర్గం మండలం సీతానగర్‌లో పాఠశాల గదుల్లో పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవనం నిర్మించాలి. – నరేందర్, సీతానగర్

✓ ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లాం. త్వరలో పరిష్కారం కానుంది. – ధనుంజయ, ఎంపీవో, అల్లాదుర్గం

రైతులకు ఇబ్బందుల్లేకుండా కొనుగోళ్లు: తహసీల్దారు

హవేలిఘనపూర్: రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని తహసీల్దారు సింధూ రేణుక అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్, డీటీ నవీన్‌కుమార్ ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

రామాయంపేట: దళారులను నమ్మి రైతులు మోసపోవొద్దని రామాయంపేట సహకార సంఘం ఛైర్మన్ చంద్రం అన్నారు. పుర పరిధిలోని కోమటిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుప్రభాతరావు, రమేశ్‌రెడ్డి, సహకార డైరెక్టర్లు ఉన్నారు.

దిగుబడుల అంచనాలకే పంట కోత ప్రయోగాలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: దిగుబడుల అంచనాల కోసమే పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నామని నర్సాపూర్ డివిజనల్ ఉప గణాంక అధికారిణి జ్యోతి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని దేవులపల్లిలో రైతు తలారి రామానుజం వ్యవసాయ క్షేత్రంలో వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏటా పంటల దిగుబడులను అంచనా వేయాల్సి ఉంటుందన్నారు. పంట కోత ప్రయోగం ద్వారా రైతుకు ఎకరాకు 24- 26 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రణాళిక గణాంక అధికారి నర్సింలు, పంచాయతీ కారోబార్ నర్సింహాచారి, రైతులు పాల్గొన్నారు.

అక్రమ నీటి తరలింపు అడ్డుకోవాలి


కిష్టాపూర్ హల్దీ వాగు వద్ద రైతులు

తూప్రాన్, న్యూస్‌టుడే: మండల పరిధి కిష్టాపూర్ శివారులోని హల్దీవాగు నుంచి కొందరు ఇష్టారీతిన మోటార్లు బిగించి, పైప్‌లైన్లు వేసి నీటిని అక్రమంగా తరలిస్తున్నారని శుక్రవారం పలువురు రైతులు ఆందోళన నిర్వహించారు. గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ దగ్గర హల్దీ వాగులో కొందరు కొన్ని రోజులుగా బహిరంగంగా పైపులైన్లు వేస్తున్నారని ఆరోపించారు. అనంతరం గజ్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు రైతులు తెలిపారు.

దేశాభివృద్ధికి శాస్త్రీయ విజ్ఞానమే పునాది

మెదక్: శాస్త్రీయ విజ్ఞానమే దేశాభివృద్ధికి పునాది అని పట్టణ సీఐ నాగరాజు అన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం గీతా జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, డ్రగ్స్, మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి సీఐ మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలు వదిలి సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. కరస్పాండెంట్ ప్రసాద్‌రావు, ప్రిన్సిపల్ సాయిరాం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేశ్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులతో గ్రామాభివృద్ధి


మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాసరావు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో సమగ్రమైన అభివృద్ధి జరగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉపాధి పథకం కింద దాదాపు 250 పనులు చేసుకోవడానికి అవకాశం ఉందని.. ఇందులో కనీసం 60శాతం పనులను గుర్తించాలని సూచించారు. ఇందుకు వచ్చే నెల 6వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో పుణ్యదాస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.కోటితో త్వరలో మరమ్మతులు

నర్సాపూర్: మండలంలోని మూసాపేట- దౌలాపూర్ వరకు నిర్మించిన తారు రోడ్డు రెండేళ్లకే అధ్వానంగా మారిన తీరుపై 'ప్రయోగం తారు మారు' శీర్షికన 'ఈనాడు'లో ఈనెల 20న వచ్చిన కథనానికి స్పందించారు. రోడ్డు మరమ్మతులు, మార్గ మధ్యలో వంతెనకు సైడ్‌వాల్స్ నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. వీలైనంత త్వరలో టెండరు ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు.

జాతీయ రహదారిపై పొదల తొలగింపు

శివ్వంపేట: నర్సాపూర్-తూప్రాన్ 161 ఏఏ జాతీయ రహదారి శివ్వంపేట మండలంలో ఇరుకు వంతెన వద్ద సూచికలు కనిపించకుండా పొదలు పెరిగాయి. సమస్యపై ఈ నెల 9న 'రహదారులపై సూచికలు ఏర్పాటు చేయరూ!' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఎన్‌హెచ్ డిప్యూటీ ఈఈ రామకృష్ణ స్పందించారు. సూచిక లేనిచోట బోర్డు ఏర్పాటు చేసి, గుంతలు ఉంటే మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. పొదలు తొలగించడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు నిర్మాణానికి మంత్రి సానుకూల స్పందన

పాపన్నపేట: వెంకంపల్లి- రామతీర్థం వంతెన నుంచి పాపన్నపేట వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.... 'ఈనాడు'లో ఈనెల 23న వారధి.. ఉపయోగం లేదది' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


హాజరైన అంగన్‌వాడీలతో డీడబ్ల్యూవో హైమావతి

రామాయంపేట: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని డీడబ్ల్యూవో హైమావతి సూచించారు. శుక్రవారం రామాయంపేట పట్టణంలోని రైతువేదికలో నిర్వహించిన అంగన్‌వాడీ సెక్టార్ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సమయపాలన పాటించి మెనూ ప్రకారం కేంద్రాల్లో లబ్ధిదారులకు భోజనాలు అందించాలన్నారు. పిల్లల ఎదుగుదలను లెక్కించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న పొరపాట్లు సరి చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు, సూపర్‌వైజర్లు తదితరులున్నారు.


పతకాలు సాధించిన క్రీడా పాఠశాల విద్యార్థినులు

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో సత్తా

చేగుంట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో చేగుంట గిరిజన బాలికల క్రీడా పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులు పతకాల పంట పండించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో రెండు బంగారు, నాలుగు వెండి, ఒక కాంస్య పతకం సాధించారని ప్రిన్సిపల్ సుమతి తెలిపారు. సుదీక్ష, నందిని బంగారు, నీహారిక, షర్మిల, రాజేశ్వరి, నందిని వెండి పతకాలు గెలుపొందారన్నారు. సంజన కాంస్య పతకం గెలుపొందినట్లు తెలిపారు. వీరితోపాటు మరికొంత మంది ప్రతిభ చాటారన్నారు. విద్యార్థినులను పీడీ రజిత, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

తపస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా మాధవి

చిన్నశంకరంపేట: తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలిగా మాధవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వరూపరాణి, ప్రధాన కార్యదర్శి సుజాత శుక్రవారం తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

మెదక్ రూరల్: మాంబోజిపల్లికి చెందిన మేకల లింగం కుమారుడు అరవింద్ ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న భారాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి రూ.10వేలు సాయం అందించారు. మాజీ సర్పంచి ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, నవీన్ తదితరులున్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

పెద్దశంకరంపేట: ఉపాధి పనుల గుర్తింపు గ్రామసభలను శుక్రవారం మండలంలోని గొట్టిముక్కల, కోలపల్లి గ్రామాల్లో నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించిన సమావేశాల్లో వచ్చే ఆర్థిక సంవత్సరం గ్రామాల్లో చేపట్టబోయే పనులను గుర్తించి తీర్మానం చేశారు. ఉపాధిహామీ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి..

హవేలిఘనపూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని మామిడి సుధాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పలు పాఠశాలల్లో ఓట్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మధుమోహన్, ఉపాధ్యాయులు శివరాజ్, సందీప్ కృష్ణ, భరత్ తదితరులున్నారు.

పేదలకు చేయూత

రామాయంపేట: కౌన్సిలర్, భారాస పట్టణ అధ్యక్షుడు గజవాడ నాగరాజు పుట్టినరోజు సందర్భంగా పేదలకు అండగా నిలిచారు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన కోటి అనిత అనే నిరుపేదకు సొంత నిధులతో ఇంటి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అదే కాలనీకి చెందిన చిప్పకుర్తి శంకరమ్మ ఇంటి మరమ్మతు పనులు ప్రారంభించారు. పుర ఛైర్మన్ జితేందర్ గౌడ్, నాయకులు ఉన్నారు.

పరిశ్రమలో అగ్నిప్రమాదం

చిన్నశంకరంపేట: పట్టణ శివారులోని పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి అట్టపెట్టెలు కాలిపోయాయి. ఎలిమెంటల్ కనెక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో వారు బయటకు పరుగెత్తారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో రూ.లక్షల విలువైన అట్టపెట్టెలు కాలిపోయాయని ప్యాకింగ్ మేనేజర్ జైకిసాన్, యజమాని రాజేశ్ అగర్వాల్ తెలిపారు.


రుస్తుంపేటలో శిక్షణ సివిల్ సర్వీస్ అధికారులు

పురపాలనపై అవగాహన

తూప్రాన్: పురపాలిక కేంద్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజలకు అందిస్తున్న వివిధ సేవలపై శుక్రవారం సివిల్ సర్వీస్ అధికారులకు పుర కార్యాలయంలో అవగాహన కల్పించారు. తూప్రాన్, మనోహరాబాద్ మండలాలకు శిక్షణకు వచ్చిన 10 మంది సివిల్ సర్వీస్ అధికారుల బృందానికి పరిపాలన తీరుతెన్నులను కమిషనర్ ఖాజామొయినొద్దీన్ వారికి వివరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, డంపింగ్ యార్డులు పరిశీలించారు. పలు వార్డుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి జీవన విధానాలు తెలుసుకున్నారు. నాలుగు రోజులపాటు పురపాలికలో సివిల్ సర్వీస్ అధికారుల పర్యటన ఉంటుందని కమిషనర్ తెలిపారు. అనంతరం బాధ్యతల గురించి ఛైర్మన్ మామిండ్ల జ్యోతికృష్ణను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పురపాలిక మేనేజర్ రఘువరణ్, జూనియర్ సహాయకుడు దుర్గయ్య, వార్డు అధికారులు, పుర సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేటను శుక్రవారం శిక్షణ సివిల్ సర్వీస్ అధికారులు సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రం, చెరువు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. బడి చాలా బాగుందన్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు.

అధికారులు లేకుండా సమావేశం ఎందుకు?


మాట్లాడుతున్న పుర అధ్యక్షుడు చంద్రపాల్, చిత్రంలో ఉపాధ్యక్షుడు మల్లికార్జున్‌గౌడ్, శిక్షణ సివిల్స్ అధికారులు

మెదక్ టౌన్, అర్బన్, న్యూస్‌టుడే: అధికారులు లేకుండా సమావేశం ఎందుకు పెట్టినట్లని పుర కౌన్సిలర్లు.. కమిషనర్ జానకిరామ్ సాగర్, అధ్యక్షుడు చంద్రపాల్‌ను ప్రశ్నించారు. పురపాలిక సాధారణ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు చంద్రపాల్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో శిక్షణ సివిల్స్ అధికారులు పాల్గొనగా.. వారికి పాలకవర్గ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. అనంతరం సభ ప్రారంభం కాగానే 9వ వార్డు కౌన్సిలర్ కల్యాణి మాట్లాడుతూ.. వార్డు పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలపై సమాచారం ఇవ్వడం లేదన్నారు. బోరు మోటార్ల మరమ్మతుల బిల్లులో స్పష్టత లేదని 25వ వార్డు కౌన్సిలర్ కృష్ణారెడ్డి అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో సమావేశం మధ్యలో నుంచి శిక్షణ అధికారులు పుర కార్యాలయంలోని ఆయా శాఖలను పరిశీలించేందుకు వెళ్లారు. వారి వెంట ఆయా శాఖల అధికారులు, కమిషనర్ వెళ్లిపోయారు. అధికారులెవరూ లేకపోవడంతో చాలాసేపు సమావేశాన్ని నిలిపివేశారు. తరవాత కమిషనర్ మాత్రమే సమావేశానికి వచ్చారు. అధికారులు లేనప్పుడు సమావేశం ఎందుకని కమిషనర్ జానకిరామ్‌సాగర్, అధ్యక్షుడు చంద్రపాల్‌పై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 11వ వార్డు కౌన్సిలర్ సమిమొద్దీన్ మాట్లాడుతూ... పట్టణంలో కుక్కలు, పందుల బెడద ఎక్కువైందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చంద్రపాల్ మాట్లాడుతూ... ఆయా వార్డుల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని స్థానిక కౌన్సిలర్లకు ఇవ్వాలని మెప్మా అధికారులకు సూచించారు. పందులు, కుక్కల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పుర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్‌గౌడ్, శిక్షణ సివిల్స్ అధికారులు యోగేష్‌కుమార్, హితేష్ కండేల్‌వాల్, ఆశిష్ కుమార్, మొహిబుల్లా అన్సారి, సౌవిక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు

అల్లాదుర్గం: ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదైంది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని సీతానగర్‌కు చెందిన వెంకయ్య గురువారం పెద్దశంకరంపేటలో వారాంతపు సంతకు వెళ్లి తిరిగి అదే గ్రామానికి చెందిన నాగయ్య ఆటోలో వస్తుండగా రాంపూర్ శివారులో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందగా.. నాగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకయ్య కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ రవిపై కేసు నమోదైంది.

ఉన్నత చదువులకు దూరమవుతున్న పేదలు: ఎస్ఎఫ్ఐ

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ ఉప తహసీల్దార్ మహేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటి వరకు రూ. 8300కోట్ల బోధనా రుసుం, ఉపకార వేతనాలు బకాయి ఉండడంతో ఆయా విద్యా సంస్థలు సంబంధిత ధ్రువపత్రాలు విద్యార్థులకు ఇవ్వడం లేదు. దీంతో ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు భాను, అజయ్ తదితరులున్నారు.


కొల్చారం: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొల్చారంలో డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్‌కు సంఘం ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. సమస్యలు పరిష్కరించకుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, నియోజకవర్గ ఇన్‌ఛార్జులను అడ్డుకుంటామని హెచ్చరించారు. సభ్యులు భాను, అజయ్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే


కస్తూర్బాగాంధీ విద్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట: విద్య, విద్యుత్తు రంగాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిధులు సమకూరేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శివాయపల్లి, వీరోజిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం పెద్దశంకరంపేట కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లలో సమస్యలు పట్టించుకోలేదన్నారు. విద్యుత్తు రంగంలో అధికారుల పని తీరు సరిగ్గా లేకపోవడంతో సమస్యలు తలెత్తున్నాయన్నారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కస్తూర్బా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి పరిష్కరిస్తామన్నారు. పేట మండలానికి విద్యుత్తు పనులకు ప్రత్యేక నిధులు రూ.70 లక్షలు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మధు, నారాగౌడ్, సంతోష్, పెరుమాండ్లగౌడ్, సంగమేశ్వర్, ఎంపీడీవో రఫీఖున్నీసా, తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఏపీఎం గోపాల్ ఉన్నారు.

మనోవేదనతో వృద్ధురాలి మృతి


దుర్గమ్మ

పాపన్నపేట: వారసత్వ భూమి ఫౌతి కోసం తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగి మనోవేదనతో తన తల్లి మరణించిందని ఆమె కుమారుడు మోహన్ ఆరోపించారు. మండల పరిధిలోని అర్కెల గ్రామానికి చెందిన జనుముల వెంకయ్య గతేడాది నవంబర్‌లో మృతి చెందాడు. అతని పేరిట ఉన్న 18.5గుంటల భూమిని తల్లి దుర్గమ్మ పేరిట ఫౌతి చేయడానికి స్లాట్ బుకింగ్ చేసుకున్నారు. ఈనెల 4న ఫౌతి కావాల్సి ఉండగా 20 రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారన్నారు. దివ్యాంగురాలైన తన తల్లి కార్యాలయం చుట్టూ తిరిగి మనోవేదనకు గురైందన్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఆందోళనకు గురై నిద్రలోనే మరణించినట్లు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ సతీష్ కుమార్‌ను వివరణ కోరగా... రికార్డుల్లో భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉండటం వల్ల ఫౌతి చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు.

తండ్రి హఠాన్మరణం.. తలకొరివి పెట్టిన తనయ

మనోహరాబాద్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి గ్రామ సమీపంలోని వెంచర్‌లో రహదారి పక్కన విగతజీవిగా మారాడు. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన తప్పెట రవి(54) మధ్యాహ్నం 2 గంటల వేళ ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తరవాత రహదారి పక్కన రవి విగతజీవిగా పడి ఉన్నట్లు కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన వ్యక్తి సమాచారం అందించారు. ఈ మేరకు భార్య సుశీల, కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. రవి కుమారుడు గతంలోనే మృతి చెందడంతో ఆయన కుమార్తె రాణి తండ్రికి తలకొరివి పెట్టింది. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

బస్సు ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

అల్లాదుర్గం: ఆర్టీసీ బస్సు-ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన అకోలా హైదరాబాద్161- జాతీయ రహదారిపై ముస్లాపూర్ శివారులో శుక్రవారం జరిగింది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖాదిరాబాద్‌కు చెందిన పోచయ్య ద్విచక్రవాహనంపై బొడ్మట్‌పల్లి నుంచి జోగిపేట వైపు అపసవ్య దిశలో వెళుతున్నాడు. ఎదురుగా ఖేడ్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు లింగంపల్లి నుంచి నారాయణఖేడ్ వస్తుండగా ఢీకొట్టాడు. దీంతో పోచయ్యకు గాయాలు కాగా 108వాహనంలో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.